క్లుప్తంగా

సామూహిక కుంకుమార్చనలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

విజయనగరం టౌన్: స్థానిక రామానాయుడు రోడ్డులోని శ్రీకోటసత్తెమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం లలిత సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల చివరి రోజు అయిన మంగళవారం పెద్దచెరువులో తెప్పోత్సవం, ఘటాల ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో కూడిన విద్య



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పైడితల్లి

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పైడితల్లి తెలిపారు. సోమవారం స్థానిక సంజీవయ్య కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పలువురు పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మూడేళ్ల వయసు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని, నాణ్యమైన విద్య, భోజనం అందివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాధ, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



చిట్టిబాబును సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

విజయనగరం లీగల్: జిల్లా కోర్టు ప్రాంగణంలో విజయనగరం బార్ అసోసియేషన్ సభ్యుడు పెంకి చిట్టిబాబును సోమవారం ఘనంగా సన్మానించారు. విజయనగరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె.రవిబాబు మాట్లాడుతూ నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా ఇచ్చే అత్యంత ప్రతిష్టాత్మకమైన భారతరత్న సి.సుబ్రహ్మణ్యం జాతీయ అవార్డు చిట్టిబాబును వరించడం న్యాయవాదులందరికీ గర్వకారణమన్నారు. న్యూఢిల్లీలో ఆయన ఆ అవార్డు అందుకున్నందున ఇక్కడ ఈ అభినందన సభ, సన్మానం ఏర్పాటు చేశామన్నారు.

అహ్మదాబాద్ మృతులకు నివాళి



మృతులకు నివాళులు అర్పిస్తున్న సంఘ నాయకులు

విజయనగరం టౌన్: గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని మూడు లాంతర్ల జంక్షన్ వద్ద సోమవారం నివాళులర్పించారు. అనంతరం ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ దుర్గారావు మాట్లాడుతూ విమాన ప్రమాద ఘటన చాలా విషాదకరమని, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, బాధిత కుటుంబాలకు ఆ భగవంతుడు ధైర్యాన్నివ్వాలని కోరారు. కార్యక్రమంలో దవళ సర్వేశ్వరరావు, ఎస్కే భాషా, ఎం.చంద్రకళాధర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



చిన్నయ్య, పైడితల్లి కుటుంబాలను పరామర్శిస్తున్న అప్పారావు

గంట్యాడ: మండలంలోని రామవరం గ్రామంలో ఆదివారం గోడకూలిన ఘటనలో కూలీలు ఎర్ర చిన్న య్య, కొలుసు పైడితల్లి మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న కల్లుగీత కార్మికుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పురం అప్పారావు మృతుల కుటుంబాలను సోమవారం పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గజపతినగరం మండలం రంగుపురంలో కొత్తవలస సత్యం, ఎస్.కోట మండలం గోపాలపల్లిలో ఒక గీత కార్మికుడు మరణించారని, ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. మృతుల కుటుంబ సభ్యులు గీత కార్మికులకు అందించే సహాయం గురించి సచివాలయాల్లో పదేపదే అడుగుతుంటే సైట్ పనిచేయడం లేదని సిబ్బంది చెబుతున్నారన్నారు.

కూటమి పాలనలో ప్రజలకు మోసం

- ఎన్నికల హామీల అమలులో ఘోర వైఫల్యం
- ఏడాది పాలనలో అవినీతి, అక్రమాలు, అరాచకాలే అధికం
- ప్రజలను మోసగించినందుకు చంద్రబాబు క్షమాపణలు చెప్పాలి
- వెన్నుపోటు పుస్తకావిష్కరణలో మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అధికారంలోకి వస్తే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఏడాది పాలనలో వాగ్దానాలేవీ నెరవేర్చకుండా ప్రజలను నమ్మించి తిరుగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నగరంలోని కోలగట్ల నివాసం వద్ద కూటమి పాలనలో ప్రజలకు జరిగిన మోసంపై రూపొందించిన వెన్నుపోటు పుస్తకాన్ని ఆయన సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి ప్రజలకు అనేక రకాల హామీలిచ్చాయని, వాటి అమలులో మాత్రం ఘోరవైఫల్యం చెందాయన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఏ ఒక్క పథకమూ పూర్తిస్థాయిలో ఇవ్వలేదని విమర్శించారు. ఏడాదికి నాలుగు గ్యాస్ బండలు అని మొదట చెప్పి, ఇప్పుడేమో మూడు ఇస్తున్నారని, మొదటి ఏడాది గ్యాస్‌బండలు కూడా ఎగ్గొట్టారని మండిపడ్డారు. ఇప్పుడేమో తల్లికి వందనం అందరికీ అని చెప్పి, కొందరికే ఇచ్చారని ధ్వజమెత్తారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం 175 నియోజకవర్గాల్లోని ప్రజలకు ప్రభుత్వ మోసం తెలిసేలా పుస్తకం రూపొందించి, విడుదల చేయడం జరుగుతోందన్నారు. కూటమి నాయకులకు అధికార దాహమే తప్ప ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన లేదన్నారు. ప్రజలకు మంచి జరిగేంత వరకు వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని, ప్రతిక్షణం ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేసి, కేసులు, దాడులకు దిగుతుండడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ తప్పుడు విధానాలను ప్రశ్నించే ఎంతోమంది సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కూటమి గద్దెనెక్కిన దగ్గర నుంచి అశాంతి, అరాచకం, అక్రమం, అవినీతే రాజ్యమేలుతున్నాయన్నారు. ఇదంతా గమనిస్తున్న ప్రజలు గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును గుర్తుకు తెచ్చుకుంటున్నారన్నారు. జగనన్న ఇచ్చిన ప్రతి హామీని తూ.చ తప్పకుండా అమలు చేశారని, సంక్షేమ క్యాలెండర్ విడుదల చేసి మరీ చెప్పిన తేదీకి చెప్పిన పథకం ఇచ్చారని చెప్పుకుంటున్నారన్నారు.



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



నెల్లిమర్ల: పుస్తకావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

అప్పట్లో విమర్శించిన వ్యవస్థతోనే..

అప్పట్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థను విమర్శించినే చంద్రబాబే ఇప్పుడు అదే వ్యవస్థను వినియోగించుకుంటున్నారన్నారు. బీసీ మహిళలకు 50 ఏళ్లకే పింఛన్.. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు, వలంటీర్లకు రూ.10 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీలేవీ ఎక్కడ అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఏ పథకం ఎప్పుడు అమలు చేస్తారో సంక్షేమ క్యాలెండర్ విడుదల చేసి అమలు చేయాలన్నారు. ఏడాది పాలనపై ఈ నెల 23వ తేదీ నుంచి కూటమి ఇంటింటి ప్రచారానికి సిద్ధమవుతోందని, ప్రజలకు ఏం ఇచ్చారని, ఏం ఇచ్చామని చెప్పుకోవడానికి అని నిలదీశారు. మరోవైపు కుతంత్ర రాజకీయాలకు తెరలేపి, వైఎస్సార్ సీపీ నాయకులను ప్రలోభాలకు గురిచేసి లోబరుచుకుంటున్నారని విమర్శించారు. ఇటువంటి రాజకీయాలకు భయపడేది లేదన్నారు. వైఎస్సార్ సీపీ వెంటే జనం ఉన్నారని, జనం వెంటే వైఎస్సార్ సీపీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గదుల సత్యలత, విజయనగరం నగర అధ్యక్షుడు ఆశపు వేణు, మండల పార్టీ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కరుమజ్జి సాయికుమార్, జిల్లా కార్యదర్శి దుప్పాడ సునీత, పార్టీ నాయకులు కోలగట్ల కృష్ణారావు, రెడ్డి గురుమూర్తి, బోడసింగి ఈశ్వరరావు, మారం బాలబ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోసం.. చంద్రబాబు నైజం..

నెల్లిమర్ల: అబద్ధాలు, మోసాలు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, మోసం చేయడమనేది చంద్రబాబు నైజమని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు విమర్శించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ రూపొందించిన వెన్నుపోటు పుస్తకాన్ని మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా చెడు జరిగితే ప్రశ్నిస్తానని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రంలో ఇన్ని అరాచకాలు జరుగుతున్నా ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు. నియోజకవర్గ ఓటర్లు డబ్బులకు ఆశపడి ఎన్నారైని గెలిపించారని, ఆమె పాలన చేయకుండా వ్యాపారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నియోజకవర్గాన్ని అమెరికాలా మార్చేస్తానని హామీలిచ్చి కనీస సమస్యలు పరిష్కరించడం లేదని మండిపడ్డారు. పెనుమత్స సాంబశివరాజు, పతివాడ నారాయణ స్వామినాయుడు, పొట్నూరు సూర్యనారాయణ వంటి ఉద్దండులు పాలించిన నియోజకవర్గాన్ని అధ్వానంగా మార్చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్పొరేట్ వ్యక్తులకు పట్టంగడితే పాలన ఇలాగే ఉంటుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల కమిటీ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, గదల సన్యాసినాయుడు, ఎంపీపీ అంబల్ల సుధారాణి, నగర పంచాయతీ వైస్ చైర్మన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సముద్రపు రామారావు, ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కారుకొండ కృష్ణ, ఏఎంసీ మాజీ చైర్ పర్సన్ చిక్కాల అరుణ కుమారి, కౌన్సిలర్లు చిక్కాల సంతోష్ కుమార్, చిక్కాల సుమతి, బూర సుజాత, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, నాయకులు మద్దిల వాసు మజ్జి గణేష్, కారుకొండ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



విజయనగరం టౌన్: యోగాసనాలు సాధన చేస్తున్న అధికారులు, సిబ్బంది తదితరులు

విజయనగరం టౌన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పైడితల్లి అమ్మవారి దేవస్థానం సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అమ్మవారి ఆలయ ఆవరణలో సోమవారం యోగాసనాల సాధన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాను జీవనశైలిలో భాగస్వామ్యం చేసుకోవాలని, ప్రతిరోజూ యోగా చేస్తే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. కొత్తపేట పాతబస్టాండ్ దగ్గరున్న శ్రీమన్నార్ రాజగోపాలస్వామి ఆలయం వద్ద కూడా యోగాసనాలు సాధన చేశారు.

డెంకాడ: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని జొన్నాడ పైడితల్లి ఆలయం వద్ద సోమవారం యోగాసనాలు సాధన చేశారు.

21న విశాఖలో మెగా యోగా డే..

భోగాపురం: విశాఖపట్నంలో ఈ నెల 21వ తేదీన జరిగే మెగా యోగా డేను విజయవంతం చేయాలని ఎంపీడీవో కిశోర్‌కుమార్ కోరారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో సిబ్బందితో సోమవారం సమావేశమయ్యారు. ప్రధాని మోదీ కార్యక్రమానికి హాజరవుతున్నారని, ప్రతి గ్రామం నుంచి వేకువజాము 3 గంటలకే బస్సుల్లో జనం బయలుదేరేలా చూడాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన



తహసీల్దారు కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

డెంకాడ: స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ఆందోళన చేపట్టారు. చిరుద్యోగులమైన తమకూ తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. చాలీచాలనీ జీతాలతో పనిచేస్తున్న తమను పెద్ద ఉద్యోగులుగా భావించి, పథకాలు నిలిపివేస్తుండడం అన్యాయమన్నారు. తమ పిల్లలకు న్యాయం జరిగేలా తల్లికి వందనం పథకం ఇవ్వాలని, అలాగే మిగతా పథకాలు కూడా తమకు వర్తింపజేయాలని కోరారు. అనంతరం తహసీల్దారు కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకులు ఎం.కృష్ణవేణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలువలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

విజయనగరం: కాలువలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య హెచ్చరించారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రధాన రహదారి పక్కన ఉన్న కొంతమంది ఇళ్ల యజమానులు తమ దగ్గరి కాలువలపై పలకలు వేసి ఆ స్థలంలో వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. దీంతో కాలువల్లో పూడికతీతల సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ప్రస్తుతం సిబ్బంది చేపడుతున్న పారిశుధ్య పనుల్లో ఇటువంటి సమస్యలు వెలుగుచూశాయన్నారు.

బాధ్యతల స్వీకరణ



శ్రీలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల: మండల ఏవో(వ్యవసాయ అధికారి)గా శ్రీలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆమెకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు తన వంతు కృషి చేస్తానని శ్రీలక్ష్మి తెలిపారు.

విజయనగరం లీగల్: అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది గేదెల సత్యం నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన మూడో అదనపు జిల్లా కోర్టు(ఫ్యామిలీ కోర్టు)లోని క్రిమినల్ కేసుల్లో ప్రాసిక్యూషన్ చేయనున్నారు. మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. కోర్టులో సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కోర్టు సిబ్బంది ఘనస్వాగతం పలికి, పుష్పగుచ్ఛాలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గరికిపేట, కొండగుంపాం, పూతికపేట గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ డీఈఈ పి.త్రినాధరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

'అన్నదాత సుఖీభవ'కు పీఎం కిసాన్ ఈకేవైసీ లింక్..

డెంకాడ: రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వబోయే అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి, ప్రత్యేకంగా ఈకేవైసీ చేయించుకోవాల్సిన అవసరం లేదని ఏవో తిరుమలరెడ్డి సంగీత స్పష్టం చేశారు. ఇదే విషయమై ఆమె మండల కేంద్రంలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో మొత్తం 7,207 మంది రైతులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్ పథకానికి అర్హులై ఉన్నారని, వీరిలో 6,902 మంది రైతుల ఈకేవైసీ పూర్తయి ఉందన్నారు. మిగిలిన 305 మంది రైతులు మాత్రమే ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. పీఎం కిసాన్‌కు లింక్ అయిన వారు రాష్ట్ర ప్రభుత్వ పథకమైన అన్నదాత సుఖీభవ పథకానికి లింక్ అయి ఉన్నారన్నారు.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



తమకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులంతా విజయనగరం జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసనకు దిగారు. చిరుద్యోగులమైన తాము చాలీచాలని జీతాలతో జీవితాలు నెట్టుకువస్తున్నామని, తమను కూడా పథకాల నుంచి దూరం చేస్తే ఎలా అని నిలదీశారు. ఆప్కాస్‌లో ఉద్యోగి అనే పదం తొలగించాలని, తల్లికి వందనం పథకంతో పాటు మిగతా పథకాలన్నీ తమకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకుడు ఎ.జగన్మోహనరావు, ఎస్.రామునాయుడు, ఎస్.రాజు, చిన్న, దుర్గారావు, సూరి, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం గంటస్తంభం

పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలి



పేదలకు ఇళ్లపట్టాలు అందివ్వాలని విజయనగరం పట్టణ బడుగు, బలహీన వర్గాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి నారాయణరావు, చెన్నా ధర్మలు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు పేదలతో కలిసి విజయనగరం తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం పట్టణాల్లోని పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని, అలాగే నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 30వ వార్డు ధర్మపురి సర్వే నంబరు 86/1,2,3,4,5 గయాలులో 3.77 సెంట్ల భూమిని 22-ఏ నుంచి తొలగించి అందులో పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని లేకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఎస్.అప్పలరాజు రెడ్డి, శంకరరావు, జి.సీతమ్మ, జి.రాజేశ్వరి, ఈశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం టౌన్

మౌలిక వసతులు కల్పించండి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ విజయనగరం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిబాబు, కె.రాజు కోరారు. ఇదే విషయమై వారు సోమవారం జిల్లా కేంద్రానికి వెళ్లి, డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీపీఎం స్కూలు, గాజులరేగ బాలికల పాఠశాల, కంటోన్మెంట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నెలకొన్న పలు సమస్యలను ప్రస్తావించారు. ఈ సమస్యల పరిష్కారానికి పలుమార్లు అధికారులను కలిసినా ఫలితం లేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు గుణ, శివ, లోహిత్ తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం గంటస్తంభం

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

- భారీ అన్నసమారాధన
- స్వామివారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వేపాడ: మండలకేంద్రం వేపాడలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం పదో వార్షికోత్సవం వైభవంగా సోమవారం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ అనంతరం స్నపన తిరుమంజనంలో స్వామివారికి సుగంధ ద్రవ్య అభిషేకం, నక్షత్ర హారతి, పట్టువస్త్రాలంకరణ, కర్పూరహారతితో అభిషేకం అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించారు. అనంతరం అనకాపల్లికి చెందిన రేజేటి గోప అప్పలాచార్యులు(చక్రవర్తి) వేదపండితుల బృందంతో శ్రీదేవీ భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. గ్రామపెద్దలు, దాతల సహకారంతో అన్నసమారాధన నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.



స్వామివారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



స్వామివారికి కర్పూరహారతి ఇస్తున్న ఆలయధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్